ఓం నమో భగవతే శ్రీ రమణాయ



# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : బి.వి.ఎల్.ఎన్.రాజు

సంపుటి : 23 సంచిక : 4 డిసెంబర్ 2017

రమణ భాస్కర

ఆధ్యాత్మిక మాస పత్రిక

పేజీలు : 20

గౌరవ సంపాదకులు

శ్రీమతి P.H.V. సత్యవతి (హైమ)

చందా

సంవత్సర చందా:రు॥ 150/-

విడి ప్రతి : రు॥ 12/-

చిరునామా

రమణ భాస్కర

శ్రీ రమణ క్షేత్రం,

జిన్నూరు – 534 265

ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్

సద్గురు శ్రీ నాన్నగారు

శ్రీ రమణ క్షేత్రం

జిన్నూరు – 534 265

☎ 08814 - 224747

9247104551

ఈ సంచికలో....

09-12-1984

జిన్నూరు

ప్రింటర్

శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్

(దుడే శ్రీను) ఎస్.వి.ఆర్. కాంప్లెక్స్,

పాలకొల్లు, 9848716747

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 09-12-1984, జిన్నూరు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

ఎవరైతే దుష్టులని సేవిస్తారో, దుష్ట సహవాసమే ప్రధానంగా పెట్టుకొని ఎవరైతే తిరుగుతుంటారో వాడిని మనిషి అని కాదు, కుక్క అని పిలువవచ్చు అని ఆచార్యులువారు చెపుతున్నారు. ఆచార్యులువారు ఇంత కఠినమైన మాటలు ఎందుకు చెపుతున్నారంటే దుష్టసాంగత్యం మనచేత మానిపించటంకోసం అలా చెప్పారు. లేకపోతే ఇంత కఠినమైన మాటలు ప్రయోగించవలసిన అవసరం లేదు. స్వార్థాన్ని దృష్టిలో పెట్టుకొని చాలామంది దుష్టుల సహవాసం విడిచిపెట్టరు, అదే పాపం. అలా ఎవరైతే దుష్ట జనులకి సేవ చేస్తున్నారో వాళ్ళు కుక్కతోటి సమానం అన్నారు. అయితే ఒక విషయం మీరు గ్రహించాలి. మన కళ్ళకి కనిపిస్తున్న ఈ ప్రపంచం కూడా ఒక పిచ్చి. ఈ పిచ్చి ప్రపంచం మన కళ్ళకి మిఠాయిలానో, లడ్డూలానో కనిపిస్తోంది. దానికి కారణం మనలో ఉన్న వాసనలు. ఆత్మకి పుట్టుకలేదు. మన వాసనలే పుట్టాయి. వాసనలకి ఏదో ఒక ఆధారం, ఆకారం ఉండాలి. మనస్సు స్వతంత్రంగా ఉండలేదు. దానికి ఆధారపడటానికి ఏదో ఆలంబనం ఉండాలి. రాముడి బొమ్మ, కృష్ణుడి బొమ్మ, శివుడి బొమ్మ, ఈ రూపాలన్నీ ఎందుకు పెట్టారంటే, రూపానికి సహజంగా ఆకర్షించే శక్తి ఉంటుంది. అందుచేత మనస్సు నిలబడటం కోసం, రూపదృష్టి కలుగచేసారు. ఇప్పుడు మీరు పదివేల రూపాయలు ఖర్చుపెట్టుకొని ఒక నోము నోచుకున్నదానికంటే, ఒక గంటసేపు మీరు ఇక్కడ మౌనంగా కూర్చోవటం వల్ల ఆధ్యాత్మికంగా ఎక్కువ అభివృద్ధిని పొందుతారు. మీకు ఇక్కడ ఒక్క పైస ఖర్చులేదు. కానీ మీరు ఏమనుకుంటున్నారంటే పదివేల రూపాయలు ఖర్చుపెట్టి ఒక నోము

నోచాము కాబట్టి దానివల్ల ఎక్కువ ఫలితం వస్తుంది అనుకొంటున్నారు కానీ ఇది కూడా ఒక యజ్ఞం. ఇక్కడ గంట సేపు మౌనంగా కూర్చునే వాళ్ళు మౌనంగా కూర్చుని, ధ్యానం చేసే వాళ్ళు ధ్యానం చేస్తే ఇది కూడా ధ్యానయజ్ఞం. ఈ ధ్యానయజ్ఞం వల్ల ఎక్కువగా మీ స్వరూపానికి మీరు దగ్గర పడతారు. దీనికి మీకు ఒక పైసా ఖర్చు లేదు. మీరు ఆ కొండ చుట్టూ తిరగండి, గ్లాసులో నెయ్యి తెచ్చి అందులో వెయ్యండి అంటే, మీకు తేలికగా ఉంటుంది, అలా తిరుగుతారు, నెయ్యి తెచ్చి వేస్తారు. కానీ పది నిమిషాలు ఊరక కూర్చోండి అంటే మీకు కష్టంగా ఉంటుంది. మనస్సుని లోపలికి పంపించమంటే కొంచెం కష్టంగా ఉంటుంది. మనస్సు ఇక్కడ పెట్టుకొని దృష్టి ఇక్కడ పెట్టుకొని ఏకాగ్రంగా రెండు నిమిషాలు ఉండమంటే కష్టంగా ఉంటుంది. ఆ కొండ చుట్టూ వందసార్లు తిరిగమంటే తేలికగా ఉంటుంది.

ఇక్కడ రహస్యం ఏమిటంటే నా బోధ మీరు విన్నా, భగవంతుడు చెప్పినటువంటి మాటలు మీరు విన్నా, అరుణాచలంలో కొండ చుట్టూరూ తిరిగినా, లేకపోతే జిన్నూరు రమణ కేంద్రంలో నిర్మించిన కొండ చుట్టూరూ తిరిగినా, వెంకటేశ్వరస్వామి దగ్గరికి వెళ్ళినా, ఏ దేవుడిని పూజించినప్పటికీ ఒకటే ప్రయోజనం. మీరు ఏ మతంలో ఉన్నప్పటికీ, ఏదేవుడిని ఆరాధించినప్పటికీ ఒకటే ప్రయోజనం, మనలో ఉన్న లోపాలు బయటికి పోవటం కోసం, మనలో ఉన్న పసరు బయటికి పోవటం కోసం. మనలో ఉన్న పసరు బయటికి పోతే, అబ్బ ఎంత ఆరోగ్యంగా ఉంది అనిపిస్తుంది. ఈ సాధనలు, పూజలు, జపాలు మనలో లోపాల రూపంలో ఉన్న పసరుని బయటికి గెంటివెయ్యటం కోసం మన పెద్దలు ఏర్పాటు చేసారు. సత్యవస్తువు ఇక్కడే మన హృదయంలోనే ఉంది. మీకు పుస్తకాలు చదివి ఎవరైనా చెపితే, ఆ చెప్పేడు మాటలు విని పుట్టుక చావు అంటే భయం వేస్తోంది. విషయం మీకు అర్థం కాకపోవటం వల్ల, ఎవరైనా మరణిస్తున్నాము అని చెపితే భయం వేస్తోంది. మరణం అంటే ఏమీ లేదు. మనకు కనిపిస్తున్నటువంటి ఈ శరీరం పడిపోవటం మరణం. నేను చెప్పేమాటలు జాగ్రత్తగా వినండి, మరణం వల్ల మనకి ఏమీ నష్టం రాదు. ఈ శరీరం పడిపోతుంది. దానిని మరణం అంటున్నారు. ఇప్పుడు ఎలా ఉన్నామో మరణించిన తరువాత కూడా అలాగే ఉంటాము. మళ్ళీ కొత్త శరీరం వస్తుంది. శరీరం పడిపోయినప్పుడు మరణం అంటున్నారు. కొత్త శరీరం వచ్చినప్పుడు పుట్టుక అంటున్నారు. కానీ మనలో మార్పులేదు. అయితే ఈ కొత్త శరీరం ఎప్పుడు ఆగుతుంది? మనలో వాసనలు, గుణాలు ఉన్నాయి. ఈ పాత శరీరం ఉండగా మనలో గుణాలు, వాసనలు పడిపోతే, తలంపులు పడిపోతే, ఈ ప్రపంచ పిచ్చి అనేది కిందికి రాలిపోతే, అప్పుడు ఈ పాతశరీరం పడిపోయిన తరువాత, కొత్త శరీరం రాదు. అయితే ఇప్పుడు ఆచార్యుల వారు చెప్పేది ఏమిటంటే, మనుషులు సర్వ

సాధారణంగా మహిమలకి ఇచ్చే విలువ గుణానికి ఇవ్వరు. ఎక్కడైనా సరే మహిమలకి ఎక్కువ ప్రాముఖ్యత ఇస్తారు కానీ గుణానికి ఇవ్వరు. ఇదే మాయ. అక్కడేదో మహిమలు జరిగాయి ఇక్కడేవో జరిగాయి అని చెప్పకొంటుంటారు. ఇదంతా మాయ. మహిమలన్నీ మాయే. మహిమలు కాదు కావలసింది. ఈ మహిమల వల్ల ఆరోజుకారోజు ఆ జ.న్మకాజన్మ మాయలో కూరుకుపోతాము. రాత్రి మీకు కలలో వచ్చిన పదార్థాలు ఎంత నిజమో, మీకు కళ్ళకి కనిపిస్తున్నటువంటి, లోకంలో కనిపిస్తునటువంటి మహిమలూ అంతేనిజం. మీరు ఈ మహిమల్ని అస్తమానుదృష్టిలో పెట్టుకొని కనుక ఉంటే, ఆజన్మకాజన్మ, నికృష్టమైన జన్మలలోకి నీచమైన జన్మలలోకి మనం వెళ్ళిపోతాము. నిజంగా గుణాల కంటే మహిమలు గొప్పవి అయ్యుంటే భగవద్గీతలో భగవంతుడు మీరు మహిమలు నేర్చుకోండి, మహిమలు చూడండి అని చెప్పిఉండేవాడు. కానీ మనకి ఎంతసేపు గుణాల గురించి చెప్పాడు భగవంతుడు. మహిమల గురించి ఎక్కడైనా చెప్పాడా ఏడువందల శ్లోకాలలో? ఎంతసేపూ గుణాల గురించే చెప్పాడు. ఎన్ని అధ్యాయాలలో చెప్పినప్పటికీ చాదస్తంగా గుణాల గురించే చెప్పాడు, ఎందుచేతంటే గుణం లేనివాడికి జ్ఞానం రాదు. ఒక పేదవాడికి డబ్బులేదు కానీ గుణం ఉందనుకోండి, వాడికి జ్ఞానం వస్తుంది. ఒక ధనవంతుడికి గుణం లేదనుకోండి, వాడికి జ్ఞానం రాదు. ఆత్మకి పేదవాడని ధనవంతుడని ఉండదు. పేదవాడిని, ధనవంతుడని, నల్లగా ఉన్నాడని, ఎర్రగా ఉన్నాడని ఇదంతా ప్రకృతి. మీరు మంచి గుణాలు అలవరచుకోండి అని భగవంతుడు చెపుతున్నాడు. అయితే సత్పురుష సహవాసం వల్ల మీరు సత్పురుషులని సేవించటం వల్ల, మీలో చెడు ఏదైనా ఉంటే అది రాలిపోయి, మీకు తెలియకుండానే మిమ్మల్ని మంచి గుణాలు వరిస్తాయి. అందుచేత విషం అని తెలిసి కూడా నీచులని ఆదరిస్తే నీచజనానికి సేవ చేస్తే, నీచుల వెనకాల తిరిగితే, మనకి కూడా నికృష్టజన్మలు వస్తాయి. ఇంగ్లీషులో ఒక సామెత ఉంది, ఆరుమాసాలు స్నేహం చేస్తే వారు వీరు అవుతారని, మనం ఒక మంచివాడితో ఆరు నెలలు స్నేహం చేస్తే తప్పనిసరిగా కొన్ని మంచి గుణాలు మనకి వస్తాయి. ఒక దుర్మార్గుడితో ఆరునెలలు స్నేహం చేస్తే కొన్ని దుర్మార్గ గుణాలు తెలియకుండా మనకి వచ్చేస్తాయి. ఆచార్యులవారు ఎందుకు అంత గట్టిగా చెపుతున్నారు? మనందరినీ కుక్కలు అని తిట్టాలి అని ఆయన ఉద్దేశ్యం కాదు. అంత గట్టిగా చెపితేనే కానీ మనం వినిపించుకోమని అలా చెపుతున్నారు. ఇప్పుడు ఆచార్యులవారు మన దగ్గర డబ్బు ఏదైనా ఆశించాడనుకోండి, మనని పొగుడుతాడు కానీ కుక్క అని ఎందుకు తిడతాడు? మీరు చాలా గొప్పవారు మీరు ఇప్పటికే చాలా గొప్పస్థితిలో ఉన్నారు, వైకుంఠంలో ఉన్నారు, మీరు పది రూపాయలు ఇస్తే మీకు మోక్షం వచ్చేస్తుంది అని చెప్పతాడు. మనదగ్గర ఏమీ

ఆశించటం లేదు కాబట్టి, నీచులతో స్నేహం చేసే వాళ్ళందరూ కుక్కలతో సమానం అని చెపుతున్నాడు. మన డబ్బు ఆశిస్తే అలా చెప్పడు. డబ్బు ఆశించే వాడు మీకు లేని గుణాలు కూడా ఉన్నట్టు పొగిడి, మీరు చాలా గొప్ప వాళ్ళు మీరు దేవతలతో సమానం అంటాడు.

మీకు మొట్టమొదట్లోనే చెప్పాను. ఈ రమణ కేంద్రం ఉందనుకోండి. ఒక నీడకోసం కట్టుకున్నాము. ఈ రమణకేంద్రం కట్టినతరువాత అక్కడ కూర్చొన్నంతమాత్రం చేత మనం గొప్ప స్థితికి వెళ్ళిపోము. ఇప్పుడు పోస్ట్ ఆఫీసులో ఎలా ఉన్నామో, మూడు లక్షలు పెట్టి కట్టిన రమణకేంద్రంలో కూడా అలానే ఉంటాము. అది ఒక నీడ కోసం మటుకే కట్టుకొంటున్నాము. అది గుర్తు ఉంచుకోండి. అందుచేత రమణకేంద్రం కట్టినంతమాత్రం చేత వెంటనే వైకుంఠం వచ్చి మనమీద పడిపోతుంది అనుకోవద్దు. అది ఊరికే ఒక షెల్టర్ కోసం ఏర్పాటు చేసుకొంటున్నాము. ఇక్కడ ఆచార్యులవారు చేప్పే విషయం ఏమిటంటే ఇప్పడు మీరు మహిమలు మహిమలు అనుకొంటున్నారనుకోండి, ఆకాశం నుంచి ఒక జ్యోతి క్రింద పడిపోయింది అనుకోండి మాటవరసకి, లేకపోతే ఒకడు మహిమలు చేస్తే వందరూపాయల కట్టలు వర్షంలా కురిసాయనుకోండి, లేకపోతే మహిమలు చేసి మేఘాన్ని రప్పించి వర్షం కురిపించాడనుకోండి, మహిమల వల్ల కళ్ళులేనివాడికి కళ్ళు తెప్పించాడనుకోండి, వీటన్నిటికంటే మీ దగ్గర ఉన్న సహనం గొప్పది. ఇది మీకు అర్థం అవ్వటం లేదు. కళ్ళు లేని వాడికి మీరు కళ్ళు ప్రసాదించారనుకోండి, ఆ కళ్ళు ప్రసాదించే శక్తి కంటే మీ సహనం గొప్పగుణం. నాకు కళ్ళు ప్రసాదించే మీ శక్తికంటే మీ ఓర్పు, పట్టుదల మంచిగుణాలు కాని ఈ విషయం మీకు అర్థం కావటంలేదు. మీరు మహిమల పట్ల మనస్సుని బహిర్ముఖం చేస్తే ఆ రోజుకారోజు ఆ జన్మకాజన్మ నీచ జన్మలలోకి ప్రయాణం చేయవలసిఉంటుంది. అందుచేత కాలాన్ని మనం దుర్వినియోగం చెయ్యకుండా వివేకం పెంచుకోవటానికి కాలాన్ని ఉపయోగించుకోవాలి. భగవంతుడి యందు భక్తి కలిగి ఉండటానికి కూడా కొంత జ్ఞానం అవసరం. మీకు విషయం తెలియాలి కదా! తెలుసుకోవటమే జ్ఞానం. విషయం తెలియకుండా మీకు భక్తి ఎలా కలుగుతుంది? భక్తి కలగదు. అందుచేత విషయం తెలుసుకోవటం కూడా జ్ఞానమే. జ్ఞానం కలిగితేనే కానీ మీకు భక్తి రాదు. శ్రవణం చేయడం, మననం చేయటం, మననం చేసినదానిని ధ్యానం చేస్తే జ్ఞానస్వరూపాన్ని మీరు పొందుతారు. జ్ఞానం అంటే మన స్వరూపమే. అందుచేత ఓర్పుగా ఉండాలి, నేర్పుగా ఉండాలి. సహనంతోటి ఉండాలి. మంచి గుణాలని అలవరచుకొని, మంచివాళ్ళని ప్రేమిస్తూ మంచిని స్మరిస్తూ ఉండాలి. మంచి చేసినవాళ్ళకి దుర్గతి లేదని గీతలో చెప్పారు. మంచి చేసి మరచిపోవటం నేర్చుకోవాలి. మంచి చేసి మళ్ళీ జ్ఞాపకం ఉంచుకోకూడదు. మంచి చెయ్యాలి, మరచిపోవాలి. మీరు మరిచిపోయినా భగవంతుడు

మరచిపోతాడని అనుకోకండి. భగవంతుడు ఏమీ మరిచిపోడు. భగవంతుడు జ్ఞాపకం ఉంచుకొంటాడు. దాని ఫలితాన్ని మీకు ఇస్తాడు.

మనం ఈశ్వరుడిని ప్రేమించి ఈశ్వరుడిని కనుక నిరంతరం స్మరిస్తుంటే మన హృదయం చల్లబడుతుంది. అస్తమానూ ఈ బుర్ర వేడిగా ఉందనుకోండి. సాధించేది ఏమీ లేదు. మనస్సుని చల్లబడేటట్లు చేసుకోవాలి. హృదయం చల్లబడేటట్టు చేసుకోవాలి. అప్పుడు ఆలోచనలు వస్తాయి. పిల్లలని కాలేజీకి పంపుతున్నారు. యూనివర్సిటీలకి పంపుతున్నారు. వాళ్ళు అక్కడ చదువుకొని వస్తారు. ఇంటిదగ్గర మనల్ని అర్థం చేసుకోలేరు. మనం చెప్పేది వాళ్ళకి అర్థం అవ్వదు. ఇంక ఆ చదువు ఎందుకు దండగ! అసలు చదువు యొక్క ప్రయోజనం ఏమిటి? కాలేజీలో బి.ఏ డిగ్రీ, ఎ.మ్మే డిగ్రీ తీసుకొని ఇంటికి వస్తారు. వాళ్ళు చెప్పేది మనకి తెలియదు. మనం చెప్పేది వాళ్ళకి తెలియదు. వాళ్ళు చదివిన చదువు వల్ల మనల్ని అర్థం చేసుకొనే శక్తి కూడా వాళ్ళకి లేకపోతే ఆ చదువు ఎందుకు అంటున్నాను. చదువు అనేది ఎందుకంటే, మనిషిలో ఉన్న గుణాలని పెంచటం కోసం, సమాజంలో ఉన్న గుణాలని పెంచడం కోసం, మనిషి యొక్క తెలివితేటలని పెంచటం కోసం, సమాజం యొక్క తెలివితేటలని పెంచటం కోసం మనిషికి ఉజ్వలభవిష్యత్తు నిర్మించటం కోసం, సమాజంలో స్వర్గరాజ్యం స్థాపించటం కోసం యూనివర్సిటీ చదువు యొక్క ప్రయోజనం. మనిషి యొక్క క్వాలిటీ పెంచటమే, సమాజంయొక్క క్వాలిటీ పెంచటమే ఈ చదువుల యొక్క ప్రయోజనం. చదివిన వాడికి శాంతి లేదనుకోండి. ఆ చదువులు అన్నీ దండగ. ఎంత చదివినా వాడికి శాంతి కుదరలేదనుకోండి, ఆ చదువులు అన్నీ దండగ, ఆ చదువులకి ఖర్చు పెట్టిన డబ్బు అంతా దండగ, ఎంతో చదువు చదివి ఇంటికొచ్చాక ఎలా మెలగాలో వాడికి తెలియదనుకోండి, ఇంక ఆ చదువువల్ల ప్రయోజనం ఏమిటి?

ఇప్పుడు ఆచార్యులవారు చెప్పేది నీచులని సేవించేవారు కుక్కలతో సమానం అంటున్నారు. ఆయనికి అలా అనకూడదు అని తెలుసు. కానీ మనకోసం కఠినమైన మాటలని ఉపయోగిస్తున్నారు, కానీ నేను చెప్పేది ఏమిటంటే, చదువుకున్నవాడు నీచులని కూడా భరిస్తాడు. అంటే నీచులతో సహవాసం చేస్తూ నీచగుణాలు వీడి మీద పడకుండా నీచులని కూడా భరిస్తాడు. వాడే నిజమైన విద్యావంతుడు. ఇంట్లో ఉన్న వాళ్ళందరూ కూడా దుష్టులు అయినప్పటికీ ఆ దుష్టత్వంలోకి వెళ్ళకుండా శాంత స్వభావాన్ని నిలబెట్టుకొన్న వారు ఉన్నారు. మాటవరసకి కొత్తగా ఇంటికి కోడలు వస్తుందనుకోండి, మావగారు, అత్తగారు, బావగారు, తోటికోడలూ అంతా పేచీ మనుషులు అనుకోండి, ఇంతమంది పేచీ మనుషులు

ఉన్నప్పటికీ వారి మధ్య ఏకాంతంగా ఉండి శాంతస్వభావం సహనం పోగొట్టుకోకుండా నిదానంగా ఉండి చచ్చిపోయినవాళ్ళున్నారు. వాళ్ళు నిజమైన విద్యావంతులు, ఎంతో విద్య ఉన్న వాళ్ళకి కానీ అది దొరకదు. అది సాధ్యం కాదు. జనసామాన్యం మీద కుక్కలతో సమానం అని తిట్టేస్తున్నారు ఆచార్యులవారు. దుష్టసహవాసం కనుక మనం మానలేకపోతే మన హృదయంలో దుష్టత్వం వస్తుంది. ఎంతో పరిశుద్ధమైన హృదయం కానీ భగవంతుడి వైపు తిరగదు. మీరు ఒకటి జ్ఞాపకం ఉంచుకోండి. దేవుడు ఉన్నాడా లేడా అనేది ఎలక్షనులో నిర్ణయించే విషయం కాదు. హృదయంలో ఎంతో పరిశుద్ధంగా ఉన్నవాడు కానీ భగవంతుడివైపు తిరగడు. నిర్మలమైన మనస్సు, శాంత మనస్కుడికి కానీ భగవంతుడి వైపుకి అస్సలు మనస్సు తిరగనే తిరగదు. ఎవరికైతే ఇంద్రియాలు నిర్మలంగా ఉంటాయో, ఎవడి మనస్సు అయితే స్వాధీనంలోకి వస్తుందో, ఎవడి హృదయం అయితే ప్రశాంతంగా ఉంటుందో వాడే నిజమైన విద్యావంతుడు. విద్య యొక్క పరమార్థం అది. తను ఎలా జీవించాలి, తోటివాడు జీవించటానికి ఎలా సహకరించాలి, తోటి వాడికి సరియైన దారి ఎలా చూపించాలి అని ప్రశాంతంగా ఆలోచించగలవాడే విద్యావంతుడు. నిజమైన విద్యావంతుడు సమాజంలో అన్ని వర్గాలని వాడు ఇమిటేట్ చెయ్యడు కానీ భరిస్తాడు. ఇప్పుడు మీ బిడ్డలలో ఎవరైనా చెడ్డ గుణాల వాళ్ళు ఉన్నారనుకోండి, మీరు భరిస్తున్నారా లేదా. అలాగే విద్యావంతుడు సమాజాన్ని భరిస్తాడు. అయితే ఇక్కడ ఆచార్యులవారు చెప్పేది ఏమిటంటే ఈ మాయల కంటే మహిమల కంటే గుణాలు చాలా గొప్పవి. గుణాలు కావాలంటే సత్పురుషుల యొక్క సహవాసం చెయ్యాలి, నీచుల సహవాసం చెయ్యకూడదు అని చెప్పారు. మధ్వాచార్యులు వారు ఏం చెప్పారంటే, నీచుల సహవాసం నీకు తప్పనిసరి అయితే నీచులు మిమ్మల్ని తరుముకు వస్తున్నారనుకోండి మీరు పారిపోండి. వాళ్ళ సహవాసం చెయ్యకండి. ఎదురుగా పులి వస్తోంది అనుకోండి మాటవరసకి, వెనక్కి తిరిగితే నీచులు ఎదురుగా పులి వస్తోంది, మీరు అప్పుడు పులికి జడిసిపోయి నీచుల చేతులలో పడకండి. పులి నోటిలో పడిపోండి. ఎందుచేతనంటే పులినోటిలో పడితే ఈ దేహమే పోతుంది, వెనక్కి వచ్చి మీరు నీచుల సహవాసం చేస్తే భవిష్యత్తు జన్మలు నీచాతినీచమైన జన్మలు వస్తాయి. అందుచేత నీచ గుణాలు అలవరచుకోవటం కంటే, నీచులతోటి స్నేహం చెయ్యటం కంటే మృత్యువు వచ్చినప్పటికీ పులి నోటిలో పడిపోమన్నారు, వెనక్కి వెళ్ళితే నీచులతో ప్రమాదం, ముందుకు వెళితే ఇంకా ప్రమాదం పులి ఎదురుగా వుంది. రెండూ ప్రమాదాలే. రెండూ ప్రమాదాలు అయినప్పుడు పులి నోటిలోనే పడిపోమన్నాడు. పోనీ పోతే ఆ దేహం ఒకటే పోతుంది అని.

మనం జన్మించినప్పుడు తల్లి గర్భంలోంచి మనం రావటంలేదు తల్లి గర్భంలోంచి బయటకి శరీరం వస్తోంది. అది మీరు ఆలోచించాలి. మళ్ళీ మరణించేటప్పుడు మనం ఎక్కడికీ వెళ్ళటం లేదు, శరీరం పోతోంది, అందుచేత శరీరభావన మనకి ఉండడం వల్ల శరీరం పుట్టినప్పుడు పుట్టాం అనుకొంటున్నాము అదొక తప్పు. శరీరం మరణించినప్పుడు మరణించాము అనుకొంటున్నాము అదో తప్పు. మనం రెండు పొరపాట్లు చేస్తున్నాము. శరీరం పుట్టినప్పుడు పుట్టాము అనుకొంటున్నాము, శరీరం మరణించినప్పుడు మరణించాము అనుకొంటున్నాము. ఇదీ అబద్ధమే అదీ అబద్ధమే. అయితే జన్మించినవి ఏంటి? వాసనలు జన్మించాయి. ఇప్పుడు నేను నేను అంటున్నారు చూడండి మీరందరూ అది కూడా ఒక తలంపే. మీకు నిద్రలో నేను గొడవ ఉందా? నేను గొడవ ఏమీ లేదు. ఎందుచేతనంటే తలంపు లేదక్కడ. మీకు మెలకువ వచ్చాక ఈ నేను గొడవ వస్తోంది. అంటే తలంపు వచ్చాక నేను వస్తోంది. తలంపు లేకపోతే నేను లేదు. అయితే ఇప్పుడు మనం పుట్టాము అంటే ఏమిటి? ఈ శరీరాలన్నీ ఎందుకు వచ్చాయి? వాసనలని బట్టి వచ్చాయి. వాసనలు పుట్టాయి. ఇక్కడ మీరు గ్రహించవలసినది వాసనలు ఉన్నంతకాలం, కోరికలు ఉన్నంతకాలం, తలంపులు ఉన్నంతకాలం శరీరాలు వస్తూ ఉంటాయి. ఇది ప్రకృతి యొక్క నియమం. ఒక మనిషి చెట్టు మీద నుంచి పడిపోయాడనుకోండి, పైకి వెడతాడా? క్రిందికి వెడతాడా? క్రిందే పడతాడు. క్రింద ఎందుకు పడతాడు? భగవంతుడు వాడిని పడమన్నాడా? భూమి యొక్క ఆకర్షణ శక్తి వల్ల వాడు క్రింద పడుతున్నాడు. అదేవిధంగా మనలో ఎంతకాలం అయితే వాసనలు ఉన్నాయో, ఆ వాసనలకి తగిన జన్మలు ప్రకృతే ఇచ్చేస్తుంది, ఇందులో దేవుడికి ఏమీ సంబంధం లేదు. మనం ఏమి చేస్తున్నామంటే దారిన పోయే దుమ్ము అంతా దేవుడి ముఖాన బురద చేసేస్తున్నాము - ఇదంతా దేవుడు చేసాడు, దేవుడు చేసాడు అని. దేవుడి ముఖాన బురద చిమ్ముతున్నాము. ఇందులో దేవుడికి ఏమీ సంబంధం లేదు. ఇదంతా ప్రకృతే. మనకి కొత్త శరీరాన్ని ఇచ్చే పని ప్రకృతే చేసేస్తుంది. శరీరం మరణించినప్పుడు చెయ్యవలసిన కార్యమంతా ప్రకృతే చేసేస్తుంది. ఇదంతా ప్రకృతి చేసే పనులు. ఎవడైతే ప్రకృతిని జయించాడో వాడే ఈశ్వరుడి స్వరూపాన్ని పొందుతాడు.

మనందరం మాయ చేతిలో ఉన్నాము. జ్ఞాని మాయని మాయ చేస్తాడు అంతే తేడా. అజ్ఞాని మాయ చేతిలో ఉంటాడు. జ్ఞాని మాయని మాయ చేస్తాడు. మాయని ఎవడైతే మాయ చేసాడో, వాడు జ్ఞాని అవుతాడు. మనం మాయని మాయ చెయ్యలేకపోతున్నాం అందుచేత మాయ చేతిలో ఉన్నాము. వాడు ప్రకృతిని జయించాడు

అంటారు. ప్రకృతిని జయించడం అంటే ఏమిటి? లోపల వాసనలని కోరికలని తలంపుల్ని జయించటమే, ప్రకృతిని జయించటం. లోపల మనకి ఉన్న సంస్కారాలని, మనకున్న తలంపుల్ని జయించటమే ప్రకృతిని జయించటం. ఆత్మ ఎవ్వర్ ప్రెజంట్. అంటే ఒక రోజు ఉండి ఒకరోజు లేకపోవటం లేదు. ఇప్పుడు రమణ కేంద్రం కట్టారని కొత్తగా ఆత్మ రాదు, ఇప్పుడు లేకుండా లేదు. ఆత్మ ఎప్పుడూ ఉంది - కట్టాక కొత్తగా రాదు, ఇప్పుడూ ఉంది. అయితే మనం గ్రహించవలసినది, ఆత్మ ఇక్కడ ఉంది కదా, మరి అయితే మనకి ఎందుకు అనుభవంలోనికి రావటం లేదంటే దానికి కారణం మనకి ప్రపంచ పిచ్చి ఉంది, లోక పిచ్చి ఉంది.

కొంతమంది దేవుడు ఉన్నాడా అని అడుగుతారు. భగవద్గీతలో భగవంతుడు చెప్పిన మాటలన్నీ ఆచరించి వాళ్ళకి అనుభవంలోనికి రాకపోతే ఆక్షేపించవచ్చును. ఆచరించకుండా ఆక్షేపించటం ఏంటి? ఇప్పుడు నాకు దాహం వేస్తోంది అనుకోండి, మంచినీళ్ళు పుచ్చుకున్నాక కూడా నాకు దాహం తీరకపోతే, నాకు దాహం తీరలేదని చెప్పొచ్చు. అసలు మంచినీళ్ళే పుచ్చుకోకుండా దాహం తీరలేదంటే అర్థం ఏమిటి? ఈ మాటలకి ఏమైనా అర్థం పర్థం ఉందా? నాకు దాహం వేస్తోంది అనుకోండి, మిమ్మల్ని మంచినీళ్ళు అడిగి నేను పుచ్చుకోవాలి. మంచి నీళ్ళు అడిగి పుచ్చుకొన్నప్పటికీ నాకు దాహం తీరకపోతే అది లోటు. మంచినీళ్ళు త్రాగకుండా నాకు దాహం వేస్తోంది అంటే అర్థం ఏమిటి? దాహం వేసినప్పుడు మంచి నీళ్ళు పుచ్చుకోవాలి, అప్పుడు దాహం తీరుతుంది. అయితే భగవంతుడు చెప్పిన మాటలు మీరు ఆచరించండి, ఆచరించిన తరువాత కూడా మీకు అనుభవానికి రాకపోతే ఆక్షేపించండి. కృష్ణుడిని రాముడిని అప్పుడు ఆక్షేపించండి. అసలు మీరు ఆచరిస్తున్నారా? ఈ విమర్శించే వాడు ఆచరిస్తున్నాడా? దేవుడు లేడని చెప్పేవాడు, దేవుడి మాటల మీద విశ్వాసం లేని వాడు, దేవుడి మాటలని వాడు ఆచరించడు? ఏరకంగా చేస్తే మీకు జ్ఞానం వస్తుందో గీతలో చెప్పాడు. ఆ రకంగా చేసిన తరువాత కూడా వీడికి జ్ఞానం రాకపోతే దేవుడిని ఆక్షేపించవచ్చు. అసలు దేవుడి మీద విశ్వాసమే లేదు. విశ్వాసం నమ్మికలేని వాడు దేవుడి మాటలని ఎక్కడ ఆచరిస్తాడు? వాడు ఆచరించడు. ఆచరించకుండా ఆక్షేపించటం పొరపాటు.

ఆచార్యులవారు చెప్పింది దుష్టసహవాసం చేసిన వాళ్ళు కుక్కతో సమానం అన్నారు. మన చెవులకి కఠినంగా ఉండవచ్చు ఆమాట. అసలు కొంతమంది మాట్లాడుతుంటే వినలేము. చాలా కఠినంగా మాట్లాడుతుంటారు. కొంతమంది మాట్లాడుతుంటే సరస్వతి

తాండవిస్తుంటుంది. కానీ ఆచార్యులవారు కూడా ఆయన హృదయంలో ఉన్న మృదుత్వాన్ని దాచుకొని కఠినమైన మాటలు మాట్లాడుతున్నారు. ఆచార్యులవారు సాక్షాత్తూ శంకరుడి యొక్క అవతారం. ఒక్కోసారి తల్లి కూడా పిల్లలమీద ఎంత ప్రేమ ఉన్నప్పటికీ, కోపం తెచ్చుకొని గట్టిగా కేకలు వేస్తుంది. ఒక్కోసారి గట్టిగా కొట్టేస్తుంది. అప్పుడు కూడా ప్రేమ వల్లే కొడుతోంది కానీ ద్వేషం వల్ల మటుకు కాదు. నీచులతో స్నేహం చేసేవాళ్ళు అందరూ కుక్కలతోటి సమానమని అంత కఠినంగా అంత దుర్భాషలతోటి ఆచార్యులవారు చెపుతున్నారంటే కేవలం మనయందు ప్రేమ వల్లే చెపుతున్నారు కాని, మనమీద ద్వేషం కాదు. భగవంతుడు మనకి మర్యాదగా చెపుతున్నాడు. మనం వినమనుకోండి మనకి నీచ జన్మలు వస్తాయి. కష్టం నాదాకా వస్తేనేకానీ నేను గ్రహించను అనేవాడు తెలివితక్కువ వాడికిందే లెక్క. అసలు తెలివి అంటే అర్థం చేసుకోండి. ఉదాహరణకి ఒక కష్టం ఉందనుకోండి, ఆ కష్టం నాదాకా వస్తేనే కానీ నేను గ్రహించననుకోండి, నేను తెలివి తక్కువ వాడికిందే లెక్క. ఎదుటివాడు ఒక విషయం వల్ల కష్టపడుతుంటే, అటువంటి పొరపాటు చేస్తే నేను కూడా కష్టపడతాను అని ముందే గ్రహించి, ఆ పొరపాటు చెయ్యకుండా ఉంటే, వాడు తెలివైన వాడికింద లెక్క. అంటే ఎదుటివాడి యొక్క అనుభవాన్ని కూడా తన సొంతం చేసుకుంటే, వాడు తెలివైన వాడు. ఎదుటివాడి అనుభవాన్ని ఎవడైతే తన సొంతం చేసుకోడో వాడు తెలివితక్కువ వాడు. నామం ఉంది, రామనామం, కృష్ణనామం, శివనామం, ఏదో నామం ఉంది; రోజుకి రెండువేల సార్లో మూడువేలసార్లో అనుకోమని చెప్పారనుకోండి పెద్దలు, మీరు ఆ రెండువేల సార్లు మూడువేల సార్లు నిర్మలంగా అనుకున్న తరువాత కూడా మీకు శాంతి రాకపోతే మీరు ఆక్షేపించవచ్చు. అసలు ఒక్కసారన్నా అనుకుంటున్నారా? మీరు రోజుకి మూడువేల సార్లు అనుకోండి మీరు మాటవరసకి, మీకు నచ్చిన నామం, మీరు మెచ్చిన నామం, అనుకున్నప్పుడు కూడా మీకు శాంతి దొరకకపోతే మీరు ఆక్షేపించండి. మీరు అనుకొంటున్నారా ఎప్పుడైనా అసలు? ఒకవేళ అనుకొన్నా నోరు అనుకొంటుంది కానీ హృదయం ఎక్కడ ఉంది? ఎప్పుడైనా అనుకొన్నా నోరు అనుకొంటుంది, అక్కడ హృదయం ఉండదు. మనం హృదయాన్ని ప్రపంచానికి ఇస్తున్నాము నోటినేమో దేవుడికి ఇస్తున్నాము.

వారానికి ఒక గంట వచ్చి ఇక్కడ నాన్నగారు చెప్పిన మాటలు వింటున్నాము, ఇది జీవితంలో చాలా అప్రధానమైనది, ఏదో కాలక్షేపానికి వెళ్ళి వద్దాము కొంతసేపు అని మీరు అనుకోవచ్చు. కానీ మీరు మరణించిన తరువాత తెలుస్తుంది, మీ జీవితంలో జరిగిన అన్ని

సంఘటనల కన్నా కూడా ఇదే ప్రధానమైనది అని. మీరు ఇంటికాడ చేసుకునే పనులు అన్నీ ప్రధానమని ఇక్కడికి వచ్చి ఒక గంటసేపు కూర్చోవటం అప్రధానమని మీ మనస్సుకి ఇప్పుడు అనిపించవచ్చు. కానీ మీరు జీవితంలో చేసుకొనే పనులు అన్నీ, మీరు ఇంటికాడ చక్కపెట్టుకొనే పనులు అన్నీ ఇంతకంటే ప్రధానమైనవి కాదని, అవే అప్రధానమైనవి ఇదే ప్రధానమైనదని మీకు మరణించిన తరువాత కానీ తెలియదు. ఏది ప్రధానమైన పనో, ఏది అప్రధానమైన పనో నిర్ణయించుకొనే శక్తి, అంత వివేకం ఈశ్వరుడు మనకి కలగచెయ్యాలి. రోజుకి ఎన్నో అవతారాలు మనకి. భగవంతుడు పది అవతారాలే ఎత్తాడు, మనం రోజుకి ఎన్ని అవతారాలు ఎత్తుతున్నామో! పొద్దున్న ఒక రకంగా ఉంటాము, మధ్యాహ్నం ఒక రకంగా ఉంటాము, సాయంత్రం ఒక రకంగా ఉంటాము. కొంతమందికి గంట గంటకీ ముఖం మారిపోతూ ఉంటుంది. స్నేహితులు కనిపిస్తే మొఖం ఒకరకంగా ఉంటుంది, విరోధులు కనిపిస్తే ఒక రకంగా ఉంటుంది. ముఖంలో రంగే మారిపోతుంది. మిమ్మల్ని నేను ద్వేషిస్తున్నాను అనుకోండి మాటవరసకి, అంటే మీతో నాకు ఏదో అనుబంధం ఉందన్న మాట. ప్రేమించటంలోనే అనుబంధం కాదు, ద్వేషించటంలో కూడా ఏదో అనుబంధం ఉందన్న మాట. మిమ్మల్నే ద్వేషించటం ఏమిటి? రోడ్డు మీద అనేకమంది వెళ్తున్నారు కదా! వాళ్ళ మీద నాకు ఎందుకు ద్వేషం కలగటం లేదు? బాగా అర్థం చేసుకోండి, ప్రేమించటం మాట వదిలేయండి. మీరు ఎంతసేపు ప్రేమ గొడవ, దేవుడి మీద ప్రేమ అని వింటున్నారు. నేను ద్వేషం మాట చెపుతున్నాను. మీలో ఇక్కడ కూర్చున్న వాళ్ళలో ఎవరి మీదైనా నాకు ద్వేషం వచ్చింది అనుకోండి, అంటే నాకు తెలియకుండా మీతోటి నాకు అనుబంధం ఉంది. అనుబంధం లేకపోతే మిమ్మల్నే ద్వేషించటం ఏంటి? రోడ్డు మీద వెళ్ళే వాళ్ళని ఎందుకు ద్వేషించటం లేదు. ఈ రోజున మనం ఇక్కడ కూర్చోవటం కంటే, ఈశ్వరుడు ఉన్న మాట నిజం. యదార్థం చెప్పాలంటే మనం ఇక్కడ కూర్చున్న మాట అబద్ధం. అయితే ఈ విషయం మనకి ఎందుకు తెలియటం లేదు అంటే, మనలో ఉన్న మోహం కారణం. ఇప్పుడు మనం ఇలా కూర్చుని మాట్లాడుకోవటం కూడా అబద్ధమే. ఇది కూడా స్వప్నమే. ఆత్మ నిజం, ఈశ్వరుడు నిజం, ఇది అబద్ధం. అయితే ఇది నిజం కింద అనిపిస్తోంది. ఈశ్వరుడు అబద్ధం కింద అనిపిస్తున్నాడు. ఇది నిజమని, ఈశ్వరుడు అబద్ధమని ఎందుకు అనిపిస్తోంది అంటే దానికి మనలో ఉన్న మోహం కారణం. ఉన్న వస్తువు ఉన్నట్టుగా చూడలేకపోతున్నాను, లేనిదానిని ఉందనుకొంటున్నాను, ఉన్న దానిని లేదనుకొంటున్నాను, ఇది నా బుర్రలో ఉన్న కల్మషం. అంటే నా బుర్ర పాడైపోయింది అన్నమాట. ఉన్నవస్తువుని లేదనుకొంటున్నాను, లేనివస్తువుని ఉన్నదనుకొంటున్నాను, ఇది ఒకరకమైన పిచ్చి. అందుచేత

నరేంద్రుడు అన్నాడు, ఈ లోకం కూడా పిచ్చి ఆసుపత్రి అని. పిచ్చి హాస్పిటల్‌లో ఉన్న జనమే పిచ్చివాళ్ళు కాదు. ఈ లోకంలో ఉన్న మనుషులు అందరూ పిచ్చి వాళ్ళే. ఈ కనిపిస్తున్న ప్రపంచం అంతా కూడా పిచ్చి హాస్పిటలే.

అసలు ఇంకొకటి అండీ, ఎవరి ఇష్టాన్ని బట్టి వాళ్ళు మాట్లాడేయటం, ఎవరి నోటికి వచ్చినట్టు వాళ్ళు మాట్లాడేయటం. అసలు ఆలోచించి మాట్లాడే మనుషులని చూసారా మీరు ఆడవాళ్ళలో కానీ పురుషులలో కానీ? మీ అనుభవంలో చెప్పండి. ఎక్కడైనా సరే నోటికి వచ్చినట్టు మాట్లాడేయటం, ఆవేశంగా మాట్లాడేయటం. అసలు వివేకం ప్రధానంగా పెట్టుకొని, ఆలోచనే ప్రధానంగా పెట్టుకొని, ఎంతమంది మాట్లాడుతున్నారు దైనందిన జీవితంలో? దీపం రోజున ఉపన్యాసంలో కొందరు పెద్దలు అహంకారం పోవాలి అని చెప్పారు. అహంకారం అంతా పోనక్కరలేదు కారం పోతే సరిపోతుంది. అహంకారం పోవాలని మాట వరసకి అన్నారు, తప్పు లేదు అలా చెప్పటం. అహంకారం అంతా పోనక్కరలేదు కారం పోతే సరిపోతుంది. ఈ కారం పోతే ప్రకృతి గొడవ మనకి వదులుతుంది, జన్మ పరంపరలు వదులుతాయి. మన కొంప ముంచేది ఆ కారమే. మనని ప్రకృతి గొడవలో పెట్టేది, వాసన గొడవలో పెట్టి జననమరణ చక్రంలో తిప్పేది ఆ కారమే. మనమంతా మనుషులం మళ్ళీ జన్మలు మనకి పశుజన్మలు రావనుకోకండి. కొంతమంది మనుషులు మళ్ళీ పశువులుగా పుడతారు. దానికీ కారమే కారణం. ఇప్పుడు మనందరం మనుషులుగా ఉన్నాము. మళ్ళీ జన్మ ఇంతకంటే మంచి జన్మ వచ్చేస్తుంది అనుకోకండి. మనకి పాము జన్మ రావచ్చు, కుక్క జన్మ రావచ్చు, గాడిద జన్మ రావచ్చు, చీమల జన్మ రావచ్చు, మళ్ళీ వెనక్కి వెళ్ళిపోవచ్చు మనం. అంటే ఏంటి, ఎవల్యూషన్‌లో మనం మంచి గుణాలని అభివృద్ధి చేసుకొంటూ, మనలో ఉన్న సత్యవస్తువు సమీపానికి మనం వెళ్తుంటే మళ్ళీ జన్మ ఇంతకంటే మంచి జన్మ వస్తుంది. మోక్షం వెంటనే రాకపోవచ్చు, ఇంతకంటే మంచి జన్మ వస్తుంది. ఫస్టుక్లాసు రాకపోయినా ఏదో తంటాలు పడుతూవుంటే పాసు మార్కులు వస్తాయి. అదేవిధంగా ఈ జన్మలోనే మోక్షం రాకపోవచ్చు కానీ బద్ధకించకుండా ఏదో మనకి చేతనైనంత తంటాలు పడుతుంటే, ఇంతకంటే ఉత్కృష్టమైన జన్మ వస్తుంది. అందుకే భగవంతుడు ఏం చెప్పాడంటే భగవద్గీతలో మంచి చేసినవాడికి దుర్గతి లేదు, మంచి చేసిన వాడికి నాశనం లేదు. అయితే ఏమీ ప్రయత్నం చేయకుండా మొద్దుఅబ్బాయిలా మనం ఉంటే, ఇంతకంటే నీచజన్మలు వస్తాయి. వాళ్ళని విసిరేస్తాను అన్నాడు పదహారవ అధ్యాయంలో. చంటిపిల్లలు ఇసుకలో ఆడుకుంటూ జిమ్మేసినట్టు అలా ఈ జీవులనందరినీ

నీచాతినీచమైన జన్మలలో నికృష్టమైన జన్మలలో విసిరేస్తాను అన్నాడు భగవంతుడు.

ఎక్కడ జ్ఞాని ఉన్నాడో అదే నిజమైన క్షేత్రం. పండరీపురం చరిత్ర చదవండి, అరుణాచలం చరిత్ర చదవండి, తిరుపతి చరిత్ర చదవండి, కాశీ చరిత్ర చదవండి, అక్కడ పూర్వం కొంతమంది జ్ఞానులు వెలిశారు కాబట్టి అవి క్షేత్రాలు అయ్యాయి. జ్ఞాని లేకపోతే క్షేత్రమే లేదు. కోట్లాది రూపాయలు ఖర్చు పెట్టినా, జ్ఞాని లేకపోతే క్షేత్రమే లేదు. మీరు పురాణాలలో చదివిన క్షేత్రాలు అన్నీ కూడా పూర్వం ఏదో టైములో అక్కడ జ్ఞానులు వెలిశారు కాబట్టి అవి క్షేత్రాలు అయినాయి. లేకపోతే క్షేత్రాలు అవ్వవు. కొంతమంది అంటారు ప్రశాంతంగా కూర్చుంటున్నాము కానీ ఈ వాసనలు వచ్చి మీద పడుతున్నాయి, కోరికలు, తలంపులు వచ్చి మీద పడుతున్నాయి. మా గొడవలో మేము ఉందామన్నా అవి ఊరుకోనివ్వటంలేదు. మా గొడవ మేము చూసుకుందా మంటే ఈ కోరికలు వాసనలు తలంపులు కుదురుగా ఉండనివ్వటంలేదు అంటారు. ఒకటి బాగా జ్ఞాపకం ఉంచుకోండి, ఏ తలంపులు వచ్చి మన మీద పడుతున్నాయో పూర్వ జన్మలలో ఆ తలంపుల వెనకాల మనం తిరిగాము. ఏ కోరికలు వచ్చి మనమీద పడుతున్నాయో, పూర్వ జన్మలలో ఆ కోరికల కూడా మనం తిరిగాము. ఏ వాసనలు వచ్చి మన మీద పడుతున్నాయో ఆ వాసనల కూడా మనం తిరిగాము. అప్పుడు వాటి కూడా మనం తిరిగాము, ఇప్పుడు మన కూడా అవి తిరుగుతున్నాయి. ఈ ఒక్కటీ మీరు జ్ఞాపకం ఉంచుకోండి. పూర్వమేమో అవి మంచి అనుకొని వాటి వెనుక తిరిగాము, ఇప్పుడు బోధ వినగా వినగా కొంచెం జ్ఞానం వస్తోంది, వాటిని విడిపించుకుందాము అనుకుంటూ వుంటే మన కూడా వచ్చేస్తున్నాయి. అలవాటు కదా! వాటి వెనకాల మనం తిరిగాము, ఇప్పుడు విడిపించుకుందా మంటే అవి మనల్ని విడవటంలేదు. మాటవరసకి మీరు కొంతకాలం కుక్కని పెంచారనుకోండి ఆ కుక్కమీద మీకు ప్రేమ పోయి దానిని వదిలేద్దామనుకుంటే మిమ్మల్ని ఆ కుక్క విడిచిపెట్టదు. అదేవిధంగా ఈ వాసనలు కూడా, పూర్వ జన్మలలో వాటిని పెంచి వాటి వెనకాల తిరిగాము. ఇప్పుడు కొంత వివేకం వచ్చి వీటి వల్లనే మనకి దుఃఖం వస్తోంది కదా అని వాటిల్ని విడిచిపెట్టు కుందాము అనుకుంటే మనకి అలవాటు పడి ఉన్నాయి కదా, అవి మనల్ని విడిచిపెట్టటం లేదు. వాటిని విడిపించుకోవటానికి మనం ప్రయత్నం చేస్తున్నాము కాబట్టి దీనికి సాధన అని పేరు పెట్టారు. అంతకంటే ఏమీ లేదు. సాధన సాధన అంటే మీకు భయం వేస్తోందా? ఏమీ లేదు సాధన అంటే, ఇదే సాధన.

ఒకటి జ్ఞాపకం పెట్టుకోండి మనందరమూ మనుషులమే. అందరికీ తలొక దేహం

ఉంది, కానీ మన పూర్వ జన్మలు వేరు. మీ వాసనలు వేరు, నా వాసనలు వేరు. ఇక్కడ ఇంతమంది కూర్చున్నాము. ఏ ఇద్దరి తలకాయలూ ఎప్పుడూ ఒక రకంగా లేవు. ఇద్దరి వాసనలు ఒక రకంగా లేవు. అవ్వటానికి అందరమూ మనుషులమే, ఇక్కడ కూర్చున్న మాట నిజమే! కారణం ఏమిటంటే, మన పూర్వ జన్మలు వేరు. పూర్వ జన్మలలో మనం చేసిన పనులు వేరు, మనం ఊహించిన ఊహలు వేరు, మనకొచ్చిన ఆలోచనలు వేరు, మన ఆదర్శాలు వేరు, ఆశయాలు వేరు, ఆకాంక్షలు వేరు. మనం పని చేసిన తీరులు వేరు. మీరో రంగంలో పని చెయ్యొచ్చు నేనో రంగంలో పనిచెయ్యొచ్చు, మనం పని చేసినటువంటి తీరులు వేరు. అందుచేత నాకున్న వాసన నన్ను వెంబడిస్తోంది మీ వాసన మిమ్మల్ని వెంబడిస్తోంది; నా తలంపులు నన్ను వెంబడిస్తున్నాయి మీ తలంపులు మిమ్మల్ని వెంబడిస్తున్నాయి. కానీ ఏదైనా అజ్ఞానమే, ఏ తలంపులు అయినా అజ్ఞానమే. అందరికీ ఒకే తలంపు ఎందుకు లేదంటే పూర్వజన్మలలో దేహాలు వేరు, పూర్వం పని చేసిన రంగం వేరు. ప్రారబ్దం, పూర్వ జన్మలు ముఖ్యం కాదు. అది కూడా స్వప్నమే. మనం మంచి పనులు చేస్తే, మంచి వాసనలుగా అవి మన కూడా వచ్చేస్తాయి, చెడ్డ పనులు చేస్తే చెడ్డ వాసనలు మన కూడా వచ్చేస్తాయి. జీవితంలో అన్నిటికీ కారణాలు చెప్పలేము. మీరు నన్ను భగవానుని ఎందుకు ప్రేమిస్తున్నారు అని అడుగుతారు అనుకోండి, నేను కారణం చెప్పలేను. ఒకవేళ మీరెవరైనా అడుగుతారు అనుకోండి, భగవాన్ మీద మీకెందుకు అంత ప్రేమ అని, నేను రీజన్ చెప్పలేను, మన రీజనుకి అందని విషయాలు, మన బుద్ధికి అందని విషయాలు మన జీవితంలో చాలా ఉన్నాయి. అన్నీ మన బుద్ధికి అందుతూ ఉంటే ఇక భగవంతుడు మనకి చెప్పటం ఎందుకు? మన బుద్ధికి అందని విషయాలు, మన ప్రజ్ఞకి అందని విషయాలు భగవంతుడు చెపుతున్నాడు, కాబట్టి నమ్మమంటున్నాడు. మన బుద్ధికి అందుతూ ఉంటే ఇంక నమ్మటం ఎందుకు? విషయం తెలిసినప్పుడు నమ్మటం ఎందుకు? మీకు విషయం తెలియదు కాబట్టి, భగవంతుడు చెప్పిన నిజము మీ బుద్ధికి అందటంలేదు కాబట్టి నమ్మమంటున్నాడు. ఈ కలుషితమైన మనస్సుకే అన్నీ తెలుస్తూ ఉంటే భగవంతుడు మనకింక చెప్పటం ఎందుకు? మనము గ్రహించలేము కాబట్టి ఆయన చెప్పాడు, అంతేకానీ కాలక్షేపానికి చెప్పాడా లేకపోతే జీతానికి చెప్పాడా?

నా స్నేహిడొకడు ఏమన్నాడు అంటే భగవంతుడు చెప్పిన బోధ అర్జునుడికి అర్థం అవ్వలేదు. అర్జునుడిలో రజోగుణం ఉంది కాబట్టి కృష్ణుడు చెప్పిన మాటలు విన్నాడు కానీ ఆయన బుర్ర పట్టుకోలేదు అన్నాడు. రజోగుణం ఉన్న వాడికి భగవంతుడు చెప్పినా అర్థం

అవ్వదు అన్నాడు. అప్పుడు నేను అన్నాను ఇదంతా టైము వేస్టు మనకి. ఒకవేళ అర్జునుడికి అర్థం అవ్వలేదు అనుకో మనం అర్థం చేసుకుని బాగుపడదాం. అర్జునుడికి అర్థం అయితే ఏంటి? అర్థం అవ్వకపోతే ఏంటి? ఇక్కడ మీకు వందమందికి చెపుతున్నాను వందమందికీ అర్థం అవ్వాలని లేదు, ఒక్కడు బాగుపడితే చాలు. ఇట్ ఈజ్ గ్లోరియస్ టు హెల్ప్ ఈవెన్ వన్ మేన్. ఇప్పుడు మన రమణకేంద్రం పదిలక్షలు పెట్టి కడతాము అంటున్నారనుకోండి, పదిలక్షలు ఖర్చు పెట్టినా, ఇరువై లక్షలు ఖర్చు పెట్టినా, ఈ రమణ కేంద్రం పేరు చెప్పి ఒక్క మనిషి బాగుపడితే చాలు. అర్జునుడికి అర్థం అవ్వలేదు, పోనీ నువ్వు అర్థం చేసుకో! ఎందుకిలా కాలం వృధా చెయ్యటం, వాడికి అర్థం అవ్వలేదు, వీడికి అర్థం అవ్వలేదు అని. నువ్వు అర్థం చేసుకో. పోనీ అర్జునుడిలో రజోగుణం ఉందను కోండి, అర్జునుడే పాడైపోతాడు, మనకెందుకు? మనం సత్వగుణాన్ని పెంచుకోవచ్చును కదా! మళ్ళీ ఇంకోసారి చెపుతున్నాను, మీ జీవితంలో ఇవే మధురగడియలు, మధుర క్షణాలు, మధుర గంటలు. ఈ ఆదివారాలు ఇక్కడ రెండు గంటలు కాలక్షేపం చేసారనుకోండి, ఇలా ప్రతీ ఆదివారం రెండు గంటల చొప్పున మీ జీవితంలో ఎన్ని గంటలు లెక్కకి వస్తాయో, అదే మీ నిజమైన జీవితం. ఆదివారం మీరు రెండు గంటలసేపు ఇక్కడ కాలక్షేపం చేస్తున్నారనుకోండి, ప్రతీ ఆదివారం రెండు గంటల చొప్పున ఎన్ని గంటలు అవుతోంది మీ జీవితంలో కూడుకోండి, అదే మీ యదార్థమైన జీవితం. మీకు పరలోకంలో కలిసి వచ్చేది ఈ మధుర గడియలే, ఈ సెకనులే, ఈ గంటలే.

లౌకికులు చెప్పే మాటలని మీరు గౌరవిస్తున్నారు కానీ ఆ మాత్రం గౌరవం కూడా మీరు ఈశ్వరుడు చెప్పిన మాటలకి ఇవ్వరా? రామకృష్ణ పరమహంస చెప్పినట్టు మీ బిడ్డల కోసం, మీ డబ్బులకోసం, మీ గౌరవాల కోసం ఏడ్చే ఏడుపైనా, అందులో సగమైనా ఈశ్వరుడి కోసం ఏడిస్తే, ఈశ్వర దర్శనం మూడు రోజులలో అవుతుంది. మూడు జన్మలు కాదు, మూడు రోజులలో అవుతుంది. భగవంతుడు లేడని అంటున్నాను అంటే నాలో దోషం వల్ల అంటున్నాను, భగవంతుడు లేక కాదు. భగవంతుడు లేడని ఎందుకు అనిపిస్తుంది అంటే, నాలో దోషం ఉంది ఇక్కడ. లేడు అన్నట్టుగా దోషం అనిపిస్తోంది, అక్కడ వస్తువు లేదని కాదు. మనం చిన్న చిన్న గడపలే దాటలేకపోతున్నాము, నది ఎక్కడ దాటగలం? చిన్న చిన్న గడపలే, చిన్న చిన్న గొడవలే, చిన్న చిన్న అభిప్రాయ భేదాలే దాటలేకపోతున్నాము కదా, నదులు ఎక్కడ దాటుతాం? సముద్రాలు ఎక్కడ దాటుతాం? బోదులే దాటలేకపోతే నది ఎక్కడ దాటుతాం? పెట్టీ మైండెడుగా మనం ఉంటే చిన్న చిన్న గొడవలే దాటలేకపోతే ఇంటి గడపే దాటలేనివాళ్ళం కొండ ఎక్కడ దాటుతాం? ఒకటి జ్ఞాపకం ఉంచుకోండి,

లౌకికచదువు మనకి ఎంత ఉన్నప్పటికీ మీకు పూర్వ పుణ్యబలం కనుక లేకపోతే భగవంతుడు చెప్పిన మాటలు మీకు అర్థం కావు. నమ్మలేరు. మీరు కొట్టుకు చావండి. మీరు బోలెడన్ని డిగ్రీలు సంపాదించుకోండి, బోలెడన్ని రూపాయలు సంపాదించుకోండి, ఇందిరాగాంధీ లాగ మీరు కూడా గొప్ప పేరు సంపాదించుకోండి, కానీ మీకు పూర్వపుణ్యం కనుక లేకపోతే, దైవానుగ్రహం కనుక మీమీద లేకపోతే, మీరు తలకాయని గోడకేసి కొట్టుకు చచ్చినా మీకు భగవంతుడి మీద నమ్మకం కలుగదు, భగవంతుడి మాటల మీద గౌరవం కలుగదు. ఇది ముమ్మాటికీ నిజం. మనకి కనుక పుణ్యబలం లేకపోతే మనం ఈశ్వరుడిని స్మరించలేము.

జ్ఞాని మనకి చేసే సహాయం కళ్ళకి కనబడదు, చెవులకి వినబడదు. జ్ఞాని దగ్గరి నుంచి మనకి వచ్చే సహాయం మన కళ్ళకి కనిపించేది కాదు, చెవులకి వినిపించేది కాదు, కూడికలు తీసివేతలు వేసి లెక్కలు కట్టేది కాదు. కానీ భక్తిని అభివృద్ధి చేసుకుంటే మనని భగవంతుడి పాదాల దగ్గరికి తీసుకెళ్తుంది. భక్తి అనే బంగారం భగవంతుడి పాదాల దగ్గరకి తీసుకువెళ్తుంది. మనం వేసుకొనే బంగారం ఇక్కడితో సరి, శరీరయాత్రతో ముగుస్తుంది. ఇది భౌతికం. బంగారం మీకు ఊరికే వచ్చిందా? మీరు సంపాదించుకున్నదో లేకపోతే మీ తల్లి ఇచ్చినదో అది. మీరు బంగారం ఎలా సంపాదించుకొంటున్నారో, భక్తిని కూడా బంగారం అనుకొని అలా సంపాదించుకోండి. కానీ భక్తి అనే బంగారం మిమ్మల్ని బంధించదు, భగవంతుడి పాదాల దగ్గరికి తీసుకువెళ్తుంది. ఈ బంగారం పోతుంది, భక్తి అనే బంగారం పోదు. ఈ బంగారం స్మశానం దాకా కూడా రాదు, కానీ భక్తి అనే బంగారం జన్మజన్మలకి మీ సొంత ఆస్తి. నేను చెప్పింది మీరు వినొచ్చు. కానీ ఇంటికెళ్ళి మననం చేసి దానిని మీరు సొంతం చేసుకోవాలి. మీరు సొంతం చెసుకోవాలంటే ఇంటికెళ్ళి మననం చెయ్యాలి. మననం చేస్తే మీ సొంతం అవుతుంది. నా జేబులో రూపాయి ఉందనుకోండి మీకేం కలిసి వస్తుంది? నా మెడలో కాసు బంగారం ఉందనుకోండి, మీకేం కలిసివస్తుంది? మీకు కలిసి రావాలి కదా! నేను చెప్పే మాటలు మీరు మోసుకువెళ్ళండి, ఇంటికి వెళ్ళి మననం చెయ్యండి. మననం చేస్తే మీ సొంతం అవుతాయి, మీరు సుఖపడతారు. నేను చెప్పిన మాటలు మీరు వినండి, ఇంటికి వెళ్ళండి, మననం చెయ్యండి, మననం చేసినప్పుడు కదా మీకు ఒంటబట్టేది, ఒంటబడితే కదా మీకు సొంతం అయ్యేది, మీ సొంతం అయినప్పుడు కదా మీకు సుఖం కలిగేది. మీ జేబులో ఉన్న పది రూపాయలు మీకు సుఖాన్ని ఇస్తాయి కానీ బ్యాంకులో ఉన్న కోట్లాది రూపాయలు మీకు సుఖాన్ని ఇస్తాయా? ఎవరికో నాలుగు కోట్ల రూపాయలు ఉన్నాయనుకోండి, మీరేమి సుఖపడతారు ఆ కోట్లతో? మీ ఇంటిలో

ఉన్న పదిరూపాయలు మిమ్మల్ని సుఖపెడతాయి కానీ ఆ నాలుగు కోట్లు మిమ్మల్ని సుఖపెడతాయా? జ్ఞానం దైవం అటు వుంచండి, హృదయ పూర్వకంగా మిమ్మల్ని ప్రేమించే మనుషులు ఎంతమంది ఉన్నారు ఈ లోకంలో? ఈవేళ ఉండి రేపు మాడిపోయే వస్తువులకి ఇచ్చే విలువ కూడా మీ స్వరూపాన్ని తెలుసుకోవటానికి ఇవ్వరా? ఈవేళ పచ్చగా ఉంటాయి జీవితాలు, రేపు మాడిపోతాయి. ఆ మాత్రం విలువ కూడా ఇవ్వరా మీరు ఆత్మని తెలుసుకోవటానికి?

రమణస్వామి అరుణాచలేశ్వరుడితో ఏమన్నాడు అంటే "నా శరీరం పడిపోయినా, నేను వెళ్ళిపోయినా నాతోపాటు నువ్వు కూడా పోకు, నువ్వు మట్టుకు శాశ్వతంగా ఉండు. నన్ను రక్షించావు కదా అని నీ పని పూర్తి అయిపోయింది అనుకోకు. నన్ను ఏవిధంగా అయితే కాపాడావో నువ్వు ఏవిధంగా అయితే రక్షించావో, ఏవిధంగా అయితే నీ అనుగ్రహం అనే వస్త్రాన్ని నామీద కప్పావో, అదేవిధంగా నా అనంతరం కూడా అనేకమంది జీవులని కాపాడుతూ రక్షిస్తూ నువ్వు అలా చిరంజీవిగా ఉండిపో అరుణాచలా!" అని రమణస్వామి అక్షరమణమాలలో చివరిసారిగా అంటాడు, "నన్ను రక్షించావు బాగుచేసావు బాగానే ఉంది నాకు జ్ఞానాన్ని ప్రసాదించావు, సరే బాగానే ఉంది, రమణస్వామిని రక్షించాను మన పని అయిపోయింది అని దులుపుకొని బయటికి వెళ్ళిపోకు, నేను పోతాను. నువ్వు మట్టుకు చిరంజీవిగా ఉండు, భవిష్యత్తులో జీవులని రక్షిస్తూ ఉండు, వాళ్ళకి జ్ఞానాన్ని ప్రసాదిస్తూ ఉండు, నేను పోయినా పరవాలేదు, నువ్వు మట్టుకు శాశ్వతంగా ఉండు అరుణాచలా!" అంటాడు. అదండీ గురువు యొక్క వేదన. వాడు లోకాన్ని ప్రేమిస్తాడు. ఆ అందమైన భావన మనలో ఎక్కడైనా ఉందా? మనం తొడుక్కునే గుడ్డలు అందంగా ఉండాలను కొంటున్నాము, మన శరీరాలు అందంగా ఉండాలనుకొంటున్నాము, కానీ అందమైన భావాలు రావాలని మనము ఎప్పడైనా అనుకొంటున్నామా? అందమైన భావాలతోటి మన మనస్సుని ఎప్పడైనా నింపుకుంటున్నామా?

మీరు పూజలు చేస్తున్నారు, జపాలు చేస్తున్నారు, దేవుడికి స్తోత్రాలు చేస్తున్నారు, ఎందుకు చేస్తున్నారో ఇంటివద్ద ఎప్పడైనా ఆలోచించుకున్నారా? దుఃఖానికి దూరం అవ్వటం కోసం చేస్తున్నారు. ఇవన్నీ దుఃఖానికి దూరం అవ్వటం కోసం చేస్తున్నామన్న సంగతి కూడా మీకు తెలియదు. మీరు చేసే పూజలు, వ్రతాలు, మీకు తెలియకుండా మీరు దుఃఖానికి దూరం అవ్వటం కోసం మీరు చేస్తున్నారు. కానీ అందుకు చేస్తున్నామన్న సంగతి కూడా మీకు తెలియదు. మీరు భగవంతుడు చెప్పే మాటలు శ్రద్ధగా వింటే, వాటిని అర్థం చేసుకునే

తెలివి, వాటిని ఆచరించే శక్తి ఆయనే ఇస్తాడు, అదే అనుగ్రహం. దేవుడి అనుగ్రహం అంటే మీకు అర్థం అవుతోందా? మీరు ఇలా వినగా, వినగా భగవంతుడు చెప్పే మాటలను అర్థం చేసుకునే ప్రజ్ఞ, ఆచరించే శక్తినీ మీకు ఇస్తాడు, అదే అనుగ్రహం అంటే. అంటే మీలో ఉన్న వాసనను పడగొట్టడం కోసం మీకు బలాన్ని ఇస్తాడు, అదే అనుగ్రహం. ఈశ్వరుడిని మీరు ప్రేమించని క్షణాలు వ్యర్థం. రూపాయలు పోతే రేపు మళ్ళీ సంపాదించవచ్చు. క్షణాలు పోతే అవి తిరిగి మళ్ళీ రావు. రూపాయలు పోయిన తరువాత మళ్ళీ సంపాదించుకున్న వాళ్ళు ఉన్నారు, పోయిన క్షణాలని తిరిగి సంపాదించుకున్న వాళ్ళు లేరు. భగవంతుడు తప్పించి మనకి ఈ లోకంలో నాలుగు మంచి మాటలు చెప్పేవాళ్ళు ఎవరున్నారు? ఈ తాటాకు పాకే అక్కరలేదు, చెట్టుకింద కూర్చున్నా పరవాలేదు, దూళ్ళశాలలో కూర్చున్నా పరవాలేదు, మన హృదయాలు బాగుపడాలి. ఏసుక్రీస్తు దూళ్ళశాలలో పుట్టాడు. మనకెంతో కొంత విశ్వాసం ఉన్నమాట నిజమే, కానీ అది అల్పమైనది స్వల్పమైనది. నిరంతరం ఆత్మస్తుతి పరనింద, ఈ లోకంలో కనిపించే మనుషులు చేసే పని ఇంతే కదా. ఈ లోకంలో మనుషులు పొగుడుకుంటే వాళ్ళని వాళ్ళు పొగుడుకుంటూ ఉంటారు, లేకపోతే ఎదుటివాళ్ళని విమర్శిస్తూ ఉంటారు, ఈ రెండే పనులు ఈ లోకంలో జీవులు చేసేది. ఈ రెండూ తప్పించి మీకు ఈ లోకంలో ఏమీ కనిపించదు. చెపితే ఒకరిమీద ఇష్టం మాటలు చెప్పటం, లేకపోతే అయిష్టం మాటలు చెప్పటం. ఈ రెండూ తప్పించి మీకు లోకంలో ఏదన్నా కనిపిస్తోందా? తాటాకు ఇంటిలో ఉన్న వాళ్ళు చెప్పకునే మాటలు అవే, మేడలో ఉన్న వాళ్ళు చెప్పకునే మాటలూ అవే. భక్తి అనే బంగారపు గొలుసుని సంపాదించటానికి ప్రయత్నం చెయ్యండి. అది మిమ్మల్ని ఈశ్వరుడి సన్నిధానానికి తీసుకెళ్తుంది. ఆ గొలుసు ఆధారం తోటి ఈశ్వర సన్నిధానానికి వెళ్ళొచ్చు. భక్తి కంటే మధురమైనది ఏదీ లేదు. ఇంతకీ ఆచార్యుల వారు చెప్పేది, దుష్టుల సహవాసం చెయ్యొద్దని. కొన్ని కొన్ని కాయలు చూడండి పుల్లగా ఉంటాయి, కొన్ని కొన్ని కాయలు చేదుగా ఉంటాయి, కొన్ని కాయలు అసలు నోటిలో పెట్టలేము, వగరుగా ఉంటాయి. వగరుగాఉన్న కాయలని పుల్లగాఉన్న కాయలని, చేదుగాఉన్న కాయలని మీరు ఎలాగైతే తినరో, అదేవిధంగా నీచులనందరినీ విడిచిపెట్టండి అని ఆచార్యుల వారు చెపుతున్నారు. పుచ్చిపోయిన వంకాయలని ఎవరైనా తెచ్చి ఇస్తే మీరు కూరలో వేసుకోరు కదా! పుచ్చిపోయిన వంకాయలు మన ఇంటిలో ఉన్నా సరే మనం కూరలో వేసుకోము. అదేవిధంగా మన ఇంటిలో నీచులు ఉంటే వారిని వదిలేయమని ఆచార్యుల వారు చెపుతున్నారు.

ఐన్‌స్టీన్ ఏమన్నాడు అంటే ఒక జ్ఞానిని తెలుసుకోవటం కోసం, ఒక జ్ఞానిని అర్థం చేసుకోవటం కోసం మీ ఇంట్లో జ్ఞానులు లేకపోవచ్చు మీ ఊళ్ళో లేకపోవచ్చు, మీ దేశంలో లేకపోవచ్చు, అవసరమైతే ప్రపంచం అంచులదాకా ప్రయాణం చెయ్యి. మీరు పుట్టిన ఇంట్లో లేకపోవచ్చు, మీరు జన్మించిన గ్రామంలో లేకపోవచ్చు, మీ దేశంలో జ్ఞానులు దొరక్కపోవచ్చును, అవసరమైతే జ్ఞానాన్ని సంపాదించటంకోసం సముద్రపు ఒడ్డు దాకా ప్రయాణం చెయ్యి, ప్రపంచం యొక్క అంచులదాకా ప్రయాణం చెయ్యి. మీరు పేరు ప్రఖ్యాతులు సంపాదించుకోవటానికి ఎంత కష్టపడుతున్నారో, డబ్బు సంపాదించుకోవటానికి ఎంత కష్టపడుతున్నారో, గౌరవాన్ని సంపాదించుకోవటానికి ఎంత కష్టపడుతున్నారో అంతే కష్టపడండి జ్ఞానం కోసం, మీకు జ్ఞానం వచ్చేస్తుంది. కొంతమంది మనుషులు కూడా అలా చేదుగా ఉంటారు, కొంతమంది మనుషులు వగరు వగరుగా ఉంటారు, కొంతమంది మనుషులు పుల్లగా ఉంటారు. కానీ ఏదైనా తీపి పండు దొరికినప్పుడు, బాగా పక్వానికి వచ్చిన పండుని చూస్తే, కళ్ళతోటి చూడటానికి ఆహ్లాదంగా ఉంటుంది. నోట్లో పెట్టుకుంటే తియ్యగా ఉంటుంది, అటువంటి మనుషులతోటి స్నేహం చెయ్యమని అంటున్నారు ఆచార్యుల వారు. ఈ పళ్ళలో చేదు పళ్ళు, తీపి పళ్ళు, పుల్ల పళ్ళు ఇలా రకాలు ఉంటాయి, మనుషులు కూడా అన్ని రకాలు అంటున్నారు ఆచార్యులు. కొంతమంది మనుషులు ముగ్గేసినా పక్వానికి రారు. రామకృష్ణ పరమహంస వీళ్ళని బద్ధజీవులు అని చెప్పాడు. వాళ్ళు ఈ జననమరణ పరంపరలో ఆ చక్రంలో అలా తిరుగుతూనే ఉంటారు. మీరు రాజులా, బ్రాహ్మణులా, కోమటులా, అది కాదు; మీరు ఏసుక్రీస్తు మతస్థులా, హిందూమతస్థులా అది కాదు, మీరు ఏ మతస్థులైతే ఏంటి? సత్పురుషులతో సహవాసం చెయ్యండి, నీచుల యొక్క స్నేహం వదిలేయండి అని ఆచార్యులవారు చెపుతున్నారు. మీరు ఏ కులమని కాదు, మీకు ఎంత ధనం ఉందని కాదు లేకపోతే మీకు ఎంత విద్య ఉందని కాదు. ఇక్కడ కులం ప్రధానం కాదు, గుణం ప్రధానం. కులం కాదు, గుణం గొప్ప.

భగవాన్ ఆశ్రమం ఉందనుకోండి, భగవాన్ శరీరంలో ఉన్నప్పుడు కంటే ఇప్పుడు ఆశ్రమంలో ఎక్కువ అభివృద్ధి ఉంది. ఆశ్రమం ఇంత అభివృద్ధి అవ్వాలని భగవాన్ ఎప్పుడైనా అనుకొన్నారా? అలా అనుకొంటే ఆయన జ్ఞాని ఎలా అవుతారు? ఈశ్వర సంకల్పం ఎలా ఉందో? భగవంతుడి సంకల్పం మనకి ఇష్టం ఉన్నా లేకపోయినా జరిగి తీరుతుంది. మనకి ఇష్టం ఉండవచ్చు, ఇష్టం లేకపోవచ్చు, భగవంతుడి సంకల్పం జరిగి తీరుతుంది. నా దేహం చేసే పని వేరు, మీ దేహం చేసే పని వేరు, ఒకడు రాముడి వేషం వేస్తాడు. ఒకడు కృష్ణుడి

వేషం వేస్తాడు, ఒకడు అర్జునుడి వేషం వేస్తాడు, ఇవన్నీ వేషాలే. అదేవిధంగా మన శరీరాలు కూడా వేషాలే. ఎవరి పాత్ర వాళ్ళు సక్రమంగా నిర్వర్తించి ఈ లోకం నుంచి తప్పకొని బయటికి వెళ్ళిపోవటమే. ఎవరి పాత్ర వాళ్ళు నిర్వర్తించి లోకంలో యాక్ట్ చేసి బయటికి వెళ్ళిపోవటమే. మనకి ఇటువంటి పరిస్థితులు పెట్టాడు ఏమిటి అని కొంతమంది అంటారు. అలా కాదు. మిమ్మల్ని ఈశ్వరుడు ఏ పరిస్థితులలో పెట్టాడో, ఆ పరిస్థితిలో పాత్ర సక్రమంగా నిర్వర్తించి బయటికి వెళ్ళిపోవటమే. అప్పడు మీకు ఉత్కృష్టమైన జన్మలు వస్తాయి. మీరు ఏం చేస్తున్నారో ఈశ్వరుడికి తెలియదా? మిమ్మల్ని ఏ పరిస్థితులలో పెట్టాడో, మీ దేహం ఏ పరిస్థితిలో ఉందో, ఆ పరిస్థితులు మీరు అర్థం చేసుకొని అక్కడ మీ పాత్ర చక్కగా నిర్వర్తించాలి. ఒకడు కృష్ణుడి వేషం వేసాడనుకోండి, ఒకడు అర్జునుడి వేషం వేసాడు అనుకోండి, కృష్ణుడి కంటే అర్జునుడు బాగా యాక్ట్ చేసాడనుకోండి, మనం అర్జునుడి వేషం వేసిన వాడిని మెచ్చుకొంటాము కానీ కృష్ణుని వేషం వేసిన వాడిని మెచ్చుకోము. కృష్ణుడిది భగవంతుడి వేషమే, కానీ అర్జునుడు బాగా యాక్ట్ చేసాడు అని మెచ్చుకొంటాము. అదేవిధంగా ఒకడు కలెక్టర్ ఉద్యోగం చెయ్యొచ్చు, ఒకడు జవాను ఉద్యోగం చెయ్యొచ్చు. కలెక్టర్ ఉద్యోగం చేసే వాడు ఆ పాత్ర పాడు చేస్తే, జవాను ఉద్యోగం చేసేవాడు చక్కగా నిర్వర్తిస్తే చాలా గొప్పగా చేసాడు అంటాము. ఒక డ్రామా లాంటిదే జీవితం అంతా కూడా. మన పాత్ర మనం నిర్వర్తించి ఈ లోకానికి నమస్కారం పెట్టి బయటికి పోవటమే. మనం ఏ పరిస్థితులలో ఉన్నాము ఎక్కడ జన్మించాము, ముందు అది అర్థం చేసుకోవాలి. ఎక్కడైతే శరీరాలు వచ్చాయో ఆ పాత్ర జాగ్రత్తగా పోషించి బయటికి తప్పకొని వెళ్ళిపోవటమే. అర్జునుడి పాత్ర ఇస్తే అర్జునుడి పాత్ర, కృష్ణుడి పాత్ర వస్తే కృష్ణుడి పాత్ర, దుర్యోధనుడి పాత్ర వస్తే దుర్యోధనుడి పాత్ర, ఏ పాత్ర అయితే మనకి ఇచ్చాడో ఆ పాత్ర పోషించుకొని బయటికి వెళ్ళిపోవటమే. ఒక ఇంటిలో నలుగురు కోడళ్ళు ఉన్నారనుకోండి, ఏ కోడలు ఏ పని బాగా చేస్తే, సహజంగా ఆ కోడలిని ఈ పని బాగా చేసావమ్మా అంటారు. నలుగురూ ఒకే పని చెయ్యలేరు కదా! జీవితం కూడా అంతే, అందరూ తలో పనీ చేస్తారు లోకంలో. ఒక పని పెద్ద పనీ కాదు, ఒక పని చిన్న పనీ కాదు, కానీ మన చేతిలోకి వచ్చిన పని సమగ్రంగా చేసి వదిలేయటం. మనం ఒక్కోసారి తుడిచే పని చెయ్యొచ్చు, ఒక్కోసారి వంట పని చెయ్యొచ్చు. తుడిచే పని తక్కువ పనీ కాదు, వంట పని గొప్ప పనీ కాదు. వంట చేసి ఆ కూర పాడు చెయ్యటం కంటే, మీరు ఇల్లు బాగా తుడుస్తారు అనుకోండి ఆ మనిషి గొప్ప మనిషి. ఇచ్చిన పాత్ర ఎలా చేస్తున్నాడు మనిషి అనేది చూస్తాడు భగవంతుడు. ఇచ్చిన పాత్ర ఎలా నిర్వర్తిస్తున్నారు

అది, అంతే కానీ ఇడ్లీలు చేసేవాడు గొప్పవాడు, పచ్చడి చేసేవాడు తక్కువ వాడు అని కాదు. ఒకడికి గార్డు పని ఉండొచ్చు, ఒకడికి డ్రైవరు పని ఉండవచ్చు, భగవంతుడు చూసేది వాడికి ఇచ్చిన పాత్ర ఎలా చేస్తున్నాడు అనేది చూస్తాడు.

ఉన్నది భగవంతుడు ఒక్కడే. మన కళ్ళకి కనిపించటం లేదని లేడనుకొంటున్నాము. ఇప్పుడు నాకు మీకు ఉన్నంతదూరం కంటే మీకు అతి సన్నిహితంగా ఉన్నాడు ఈశ్వరుడు. మన కళ్ళకి కనిపించటం లేదు కాబట్టి లేడు అనుకొంటున్నాము. భగవంతుడు లేని చోటు లేదు. భక్తుల కోసం భగవంతుడు ఎదురు చూస్తూ ఉంటాడు. హృదయం పెడసరంగా పెళుసుగా ఉండకూడదు, హృదయంలో మృదుత్వం సంపాదించుకోండి. బట్టలు ఎంత పరిశుభ్రంగా పరిశుద్ధంగా ఉంచుకొంటున్నామో, మనం తినే కంచాలు ఎంత పరిశుభ్రంగా పరిశుద్ధంగా ఉంచుకొంటున్నామో, అదేవిధంగా మన మనస్సుని కూడా అంత పరిశుభ్రంగా పరిశుద్ధంగా ఉంచుకోవాలి. ఇంద్రియాలని మనస్సుని బుద్ధిని పరిశుభ్రంగా పరిశుద్ధంగా ఉంచుకొన్న వాళ్ళకి ఈశ్వరసాక్షాత్కారం కలుగుతుంది. ఎవరి ఇంద్రియాలైతే నిర్మలంగా ఉంటాయో, ఎవరి మనస్సుకి అయితే వేవరింగ్ లేదో, ఎవరి మనస్సు చలన రహితంగా ఉంటుందో - గాలి లేనిచోట దీపం ఎలా ఉంటుందో, అదేవిధంగా భగవంతుడి పట్ల విశ్వాసం కూడా ఎవరికైతే చలనరహితంగా ఉంటుందో, వారికి ఈశ్వరదర్శనం అవుతుంది. మన హృదయం పరిశుద్ధం కాకపోతే, మన కూడా కోటి మంది స్మశానానికి వచ్చినా ప్రయోజనం లేదు. నేను మరణిస్తున్నాను అనుకోండి, కానీ నా మనస్సు పరిశుద్ధంగా లేదనుకోండి, నా కూడా కోటిమంది స్మశానానికి వస్తున్నారు అనుకోండి సాగనంపటానికి కానీ నాకు వచ్చేది నరకమే. ఈ జనాన్ని చూసి మోసపోకండి, జనాన్ని పబ్లిసిటీని చూసి మోసపోకండి. పరిశుద్ధమైన హృదయం ఉందనుకోండి నాకు, నేను మరణించినప్పుడు స్మశానానికి ఒక్కళ్ళు కూడా రాకపోయినా, నాకు వచ్చేది వైకుంఠమే. జనం అనే పిచ్చిలో పడకండి, ఇదొక రకమైన పిచ్చి. ఈ ప్రాపంచిక పిచ్చి మనల్ని గట్టిగా పట్టేసింది, ఒంటినిండా పట్టేసింది ప్రాపంచిక పిచ్చి. ఈ పిచ్చిలోంచి బయట పడలేకపోతున్నాము అందుచేత ఈశ్వరుడి యొక్క అస్తిత్వాన్ని ప్రశ్నిస్తున్నాము! భగవంతుడు ఉన్నాడా లేడా అని ప్రశ్నించేవాడు నిజంగా లేడు, భగవంతుడు ఉన్నాడు. ఇదే మాయ. భగవంతుడు ఉన్నాడా లేడా అని ఒకడు ప్రశ్నిస్తున్నాడు కదా, ఆ ప్రశ్నించే వాడు నిజంగా లేడు, కానీ భగవంతుడు ఉన్న మాట నిజం. మీలో ఉన్న తలంపులు మీకు తెలిసున్నా తెలియకపోయినా అన్నీ వ్యక్తం అవ్వకుండా మటుకు మీకు మోక్షం రాదు.

With malice to none, Charity even unasked, and help to all creatures in thought, word and deeds, is the pious nature of good men, always.

**- Mahabharatha**

# భగవాన్ శ్రీ రమణమహర్షి

దిll 30-12-1879న తమిళనాడులోని తిరుచ్చుళి గ్రామంలో అళగమ్మ, సుందరం అయ్యరు పుణ్యదంపతుల ద్వితీయ సంతానముగా దేహం ధరించిన వేంకట రామన్, తన 17వ ఏట అమృతానుభవమును పొంది, తరువాత కాలంలో ఏబది నాలుగు సంవత్సరములు అరుణాచల క్షేత్రంలో భగవాన్ శ్రీ రమణమహర్షిగా నివశించి, దేశ విదేశాలనుండి అనేకమంది జిజ్ఞాసువులను ముముక్షువులను తన వైపుకు ఆకర్షించుకొని, వారిని అంతిమ సత్యంలోకి మేల్కొలిపారు. భగవాన్ అంటే ఆది, అంతములు లేని శాశ్వత ఉనికి. జ్ఞాని దృష్టి మనపై పడితే, అనేక జన్మల అజ్ఞానం దగ్ధమవుతుందని, మన సనాతన ఋషుల ఉవాచ. అట్టి జ్ఞాన చక్రవర్తియైన శ్రీ రమణుడు, ఒక వ్యక్తికాదు, ఒక సిద్ధాంతం కాదు, కేవలం ఆత్మస్వరూపమైన నిర్మల ఉనికి. ద్వంద్వాలను అతిక్రమించిన రూపుదాల్చిన సత్యమే భగవాన్. భగవాన్ రమణుని జీవితం తెరచిన పుస్తకంలాంటిది. ఆయన జీవితము సజీవ చైతన్య ప్రవాహము. నిరాడంబరత, స్వచ్ఛత, మౌనము, మున్నగు వాటికి నిలువెత్తు నిదర్శనం భగవాన్. భగవాన్ బోధలో రహస్యం ఏమీ లేదు. జ్ఞానిని పరిశీలిస్తే ఆయనలో వ్యక్తి అంటూ ఎవరు కనబడరు. వ్యక్తి అనబడే పాత్రధారి నశించి ఉంటాడు. జ్ఞాని దేశ, కాల, నామ, రూప, మున్నగు సకల హద్దులను అతిక్రమించి ఉంటాడు. జ్ఞాని గురించి ఆలోచించడం, మాట్లాడుకోవడం, చదవడం, ఆయనపై మన మనస్సును ఏకాగ్రం చెయ్యడం, మున్నగునవి మన లక్ష్య సాధనకు గొప్ప ఆలంబనగా ఉపయోగపడతాయి. ఒక ఉన్నత లక్ష్యం వైపు మనము తక్కువ శ్రమతో కదలాలంటే ఉత్తమ పద్ధతి ఏమనగా, గతములో ఆ మార్గములో ప్రయాణించిన మహాత్ముల అడుగు జాడలలో నడవడమే! సాధకులకు కొంగు బంగారం వంటి అద్భుత జ్ఞానావతారమే, భగవాన్ శ్రీ రమణమహర్షి.

**(దిll 30-12-2017 తారీఖు ప్రకారం భగవాన్ జయంతి సందర్భంగా)**

**ఓం తత్ సత్**

**- చావలి సూర్యనారాయణమూర్తి, అమలాపురం, సెల్ : 9963195064**

# గురువును ఆశ్రయించే శివ స్వరూపాన్ని తెలుసుకోవాలి

గురువును బంధువు అంటారు. అది నిజమే. ఎన్నో జన్మలనుంచి బంధం ఉండబట్టే గురువు వద్దకు చేరుతాము. ఆ భాగ్యం అందరికీ పట్టదు. అందుకనే గురువును ఆది గురువు అంటారు. మీరా కృష్ణునితో "నీవు తప్ప నాకింకెవ్వరూ అక్కరలేదు" అన్నది. ఆ మాటను మన గురు విషయంలో హృదయానికి మనం హత్తుకోవాలి. ఆరాధన అంటే ఇష్టదైవమైన మన గురువుపై మనస్సును అనుసంధానం చెయ్యటం. భగవంతుడు ఇంద్రియాలను బాహ్యముఖం అయ్యేటట్లు చేసాడు. ప్రాపంచిక విషయాలచుట్టూ ఇంద్రియ లోలత్వంతో పరిభ్రమిస్తూ ఉంటాము. మనం అలా కాక సద్గురువును ఆశ్రయించి వారి ధ్యాసతోనే జ్ఞానం సంపాదించాలి. దత్తాత్రేయుల గురువుల్లో సముద్రుడు ఒకడు. సముద్రం తనపై చిన్న ఎండుటాకు పడేసినా, ఒడ్డుకు విసిరేస్తుంది. అలాగే సాధకుడు చిన్న కామవికారాన్ని కూడా తనలో ఉంచుకోకూడదు. సముద్రం ఎన్ని నదులు వచ్చినా పొంగదు నదులు రాకపోయినా కృంగదు అలాగే సాధకుడు జీవన ప్రయాణంలో లాభాలకు నష్టాలకు పొంగు కృంగు ఉండకూడదు. సాధకుడు తన మూలం ఏమిటి? అసలు సృష్టి ఎందుకు? అని తెలుసుకోవటానికి ప్రయత్నించటం తాత్వికత. అదే ఆధ్యాత్మికత. ఆ మంగళ శివ స్వరూపాన్ని ఎలా తెలుసుకోవాలి? ఆ సత్యమైన, సుందరమైన స్వస్వరూపాన్ని అనుభవంలోకి తెచ్చుకోవటానికి ఎవరిని ఆశ్రయించాలి? మన ప్రయత్నం అందులో ఎంతవరకూ అనే అవగాహన అవసరం. ఊబిలో ప్రకృతి లంపటంలో ఉన్న మనలను ఒడ్డును ఉన్నవారు గెడను మనకు సాయంగా అందించితే తేలికగా బయటపడతాము. ఆ ఒడ్డున చేరిన అనుభవజ్ఞుడైన ఎవరు అనే తపన ఆధ్యాత్మికంలో అడుగువేసిన తపన గల పుణ్య సంస్కారం ఉన్నవాళ్లకు గురువు లభిస్తాడు. గొప్ప గొప్ప మహాత్ములు గుళ్లల్లో ఉన్న విగ్రహాలు మొదలైన నిర్జీవవస్తువులు కాలానుగుణంగా ఎప్పుడో అనుగ్రహానికి సహకరిస్తాయి కాని సజీవమైన సద్గురువు మనకు ప్రసాదించే అనుగ్రహానికి సాటిరావు. అది ఇప్పుడే ఇక్కడే పొందచ్చు. చైతన్యుని చైతన్యులే లాగుతారు. సద్గురువు లభించిన వెంటనే సంశయాలన్నీ చిన్నాభిన్నమై పోతాయి. మనో వికారాలు చిత్తచాపల్యం తొలగిపోతాయి. అప్పుడు అమృతం స్రవిస్తుంది. తనలోనే పరమాత్మను దర్శిస్తాడని అనుభవజ్ఞుల ఉవాచ. గురువు ముత్యాలు ఉన్న సముద్రం. యోగులు హంసలలాగా వాటిని స్వీకరించగలరు. గురు దత్తమైన జ్ఞానమే శాశ్వతమైన తీర్థస్థానం. అక్కడే సమస్తపాపాలు క్షాళితమైపోతాయి. "రూమీ" అన్నారు. "సద్గురువు హస్తం పరమాత్ముని హస్తం వారి పరిపూర్ణతకు సమానులైనవారు లేనేలేరు. వారి నేత్రాలు ప్రేమతో మగ్నమై ఉంటాయి. వారి దాల్చిన శరీరాన్ని చూస్తాము గాని వారు సర్వశక్తివంతులని మనకు తెలియదు. మహా సముద్రాన్ని చిన్న పాత్రలో ఉంచినట్లు సాధకుడు గ్రహించాలి మరో దారి లేదు" అన్నారు. దత్తాత్రేయులు కపట సాధకులు వస్తే కల్లుకుండలు, వనితలతో ఉండే వారు. గురు ప్రవర్తనను నిజభక్తులే గ్రహించి శివరూపాన్ని పొందుతారు.

- సాగిరాజు రామకృష్ణంరాజు, అర్ధవరం, సెల్ : 9491968966